క్లుప్తంగా

వినోద్‌కుమార్‌ను కలిసిన నాయకులు



వినోద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కథలాపూర్ బీఆర్ఎస్ నాయకులు

కథలాపూర్: కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు ఆదివారం విన్నవించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిసి మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులకు నిధుల గురించి చర్చించామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఆర్మీ జవాన్ అనిల్ ఇటీవల మృతిచెందగా.. జవాన్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు నాగం భూమయ్య, గుండారపు గంగాధర్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

నాన్ వెజ్ మార్కెట్‌లో మున్సిపల్ సిబ్బంది తనిఖీ



కవర్లను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలోని మటన్, చికెన్ దుకాణాల్లో ఆదివారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల కవర్లను వినియోగించవద్దని, మరోసారి పట్టుబడితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని వ్యాపారులను హెచ్చరించారు. అలాగే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా మున్సిపల్ వాహనాలకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, విష్ణు, నిజాం తదితరులున్నారు.

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న గ్రామస్తులు

రాయికల్: మండలంలోని కుర్మపల్లిలో నూతనంగా నిర్మించే ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల సుమలత, ఉపసర్పంచ్ పుల్ల మల్లేశం, నాయకులు అంజయ్య, మల్లేశం, గంగాధర్, రాజమల్లు, తిరుపతి, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోపా నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో జిల్లా, రాష్ట్ర నాయకులు

మల్యాల: మండల గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక కేవీజీ గార్డెన్స్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో యాగండ్ల చిరంజీవి గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కరబూజ నర్సయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా భూసారపు మానిక్ గౌడ్, కోశాధికారి పొన్నం సాయికుమార్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కాలికంటి రాకేశ్ గౌడ్, యాగండ్ల సుమన్ గౌడ్, బండారి రాకేశ్ గౌడ్, ముత్యంపు మధుగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా తాళ్లపల్లి రాజశేఖర్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా నేరెళ్ల ప్రశాంత్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా కాలికంటి సాయికిరణ్, కాసారపు రాజు, గోనపెల్లి శ్రీనివాస్, గుర్రం లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బత్తిని సత్యనారాయణ, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు దుర్గపు రవీందర్ గౌడ్, అంబటి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

మెట్‌పల్లి: ఈ నెల 15 నుంచి 17 తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ తదితర పోటీలు పేర్కొన్నారు. పాల్గొనాలకునే టీంలు తమ వివరాలను 11వ తేదీ లోపు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మార్కెట్ కమిటీ పీఠం దక్కేదెవరికో?

- రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు
- ఛైర్‌పర్సన్ ఎస్సీ మహిళ, వైస్ ఛైర్మన్ బీసీలకు కేటాయింపు
- పెరిగిన పాలకమండలి సభ్యుల సంఖ్య
- ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నవారికే పదవులు



రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

రాయికల్: తొమ్మిది నెలలుగా ఖాళీగా ఉన్న రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి రెండు మూడు రోజుల్లో ఏర్పాటు కానుంది. సభ్యులు, చైర్మన్ పదవీకాలం ముగిసి ఇన్ని రోజులైనా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండి ఏర్పాటు కాకపోవడంతో ప్రతిపక్ష నాయకులు ఇతరులు దళితులపై ఎమ్మెల్యే, వివక్ష చూపుతున్నారని ఆరోపణలు చేశారు. దీంతో మార్కెట్‌కమిటీ చైర్మన్, పాలకమండలి అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ సారి ఎస్సీ మహిళకు కేటాయించడంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో పాలకమండలి సభ్యుల జాబితా విడుదల కానుంది. ప్రస్తుతం ఎస్సీ మహిళ రిజర్వేషన్ రావడంతో రాయికల్ పట్టణానికి చెందిన మారంపెల్లి సాయికుమార్ సతీమణి, మైతాపూర్ గ్రామానికి చెందిన తలారి రాజేశ్ సతీమణి చైర్మన్ రేసులో ఉన్నారు. వైస్ చైర్మన్ పదవి బీసీలకు దక్కే అవకాశం ఉంది.

పెరిగిన పాలకమండలి సభ్యుల సంఖ్య

రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా గతంలో 10 మంది ఉండగా ప్రస్తుతం 14 మందికి చేరింది. మరో నలుగురికి అదనంగా డైరెక్టర్లుగా ఎన్నుకునే అవకాశం ఉంది. అంతే కాకుండా స్థానిక సింగిల్ విండో చైర్మన్ మున్సిపల్ చైర్మన్‌తో పాటు మార్కెటింగ్ ఏడీఎం డీఎం, అగ్రికల్చర్ ఏడీలు సభ్యులుగా ఉంటారు. ఏదేమైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కరుణించిన వారికే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ దక్కే అవకాశం ఉంది. దీంతో ఎమ్మెల్యే చుట్టూ ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. 9 నెలల నుంచి చైర్మన్ పదవి ఖాళీగా ఉండడంతో నేడు, రేపు అంటూ కాలయాపన చేశారు. పార్టీలో అంతర్గత కుమ్ములాట రోజురోజుకు పెరిగిపోతుంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి చైర్మన్, పాలకమండలిని ప్రకటించాలని పార్టీ శ్రేణులు సైతం కోరుతున్నారు.

మున్సిపల్ ఛైర్మన్,ఎంపీపీ ఎన్నికపై కసరత్తు

- ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు సేకరించిన ఎమ్మెల్యే
- మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో వేర్వేరుగా సమావేశం



జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఇన్‌చార్జి ఎంపీపీతో, సర్పంచ్‌లు, జరిగిన సంఘటనపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ఎంపీపీ ఎన్నికపై కసరత్తు చేస్తున్నారు. జగిత్యాల రూరల్ ఎంపీపీ గాజర్ల గంగారాం రెండేళ్ల క్రితంతో కరోనాతో మృతి చెందాడు. దీంతో ఆ పదవిని వైస్ ఎంపీపీ(జనరల్) వ్యక్తికి కట్టబెట్టారు. దీంతో, బీసీలు తమ రిజర్వేషన్ స్థానంలో జనరల్ వ్యక్తికి అప్పగించడం ఏంటని చాలా కాలంగా ఆగ్రహంతో ఉన్నారు. అలాగే, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ బీసీ మహిళ కాగా, 4 నెలల క్రితం చైర్మన్ బోగ శ్రావణి రాజీనామా చేయడంతో జనరల్ వ్యక్తి అయిన వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో రూరల్ మండల పరిషత్‌లో ఎంపీటీసీలు, బీసీ వ్యక్తిని ఎంపీపీగా ఎన్నుకుంటేనే తాము సభకు హాజరవుతామని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే జగిత్యాల రూరల్ మండలానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లతో ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీని వెంటనే ఎన్నుకోవాలని నాయకులు కోరారు. అలాగే, జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్లతో కూడా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. చైర్మన్ ఎన్నిక ప్రక్రియ వెంటనే చేపట్టాలని వారు కోరారు. దీంతో వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎంపీపీలు, చైర్‌పర్సన్ ఎంపికకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా జగిత్యాల ఎంపీపీ స్థానం మాత్రం ఎస్సీ మహిళ కావడంతో గతంలో ఎంపీపీగా ఉన్న మ్యాదరి వనిత మృతి చెందడంతో ఆ స్థానంలో వైస్ ఎంపీపీ ములాసపు లక్ష్మి(బీసీ) ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్నారు. జగిత్యాల ఎంపీపీ స్థానం ఎన్నుకోవాలంటే ధరూర్ ఎంపీటీసీ స్థానానికి ఎన్నిక నిర్వహిస్తేనే ఎంపీపీ ఎన్నిక చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు చెపుతున్నారు. దీంతో, రెండు స్థానాలపై ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై అభ్యర్థుల్లో ఆశలు మొదలయ్యాయి.

ప్రజల సహకారంతో 12 వేల కంటి ఆపరేషన్లు పూర్తి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కళ్లను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ప్రజల సహకారంతో ఇప్పటి వరకు తాను 12 వేల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు పూర్తి చేసినట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పావని కంటి ఆస్పత్రిలో ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో 19 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఈ వృత్తిలో కొనసాగతున్నానని, పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయడం నాకు వృత్తిపరంగా చాలా సంతృప్తినిచ్చిందన్నారు. జగిత్యాలలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో 100 మంది వివిధ విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఇందులో నలుగురు కంటి వైద్యులని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, నాయకులు టీవీ సూర్యం, సురేందర్, నాగేందర్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి

మల్లాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, సాధారణ బదిలీలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల అధ్యక్షుడు ఎగ్యారపు వెంకటేశ్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే ఎస్టీయూ ఉద్యమిస్తుందన్నారు. సీపీఎస్ రద్దు కోసం అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటంలో ఉద్యోగుల పాత్ర ఒక మైలురాయి అని కొనియాడారు. పెన్‌డౌన్‌తో 41రోజుల పాటు చేసిన సకలజనుల సమ్మె చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కాగా డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేయడమే లక్ష్యంగా అవిశ్రాంత పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు



నాయికపుగూడెం కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

సారంగాపూర్: అధికారులు ఎంత చెప్పినా ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెల కావొస్తున్నా ఇప్పటికీ కొనుగోళ్ల వేగం పుంజుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం పెద్ద ఎత్తున తడిసిపోయింది. తడిసిన ధాన్యం, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నా, ఇది ఆశించిన స్థాయిలో జరగడం లేదు. పలు కేంద్రాల నుండి తడిసిన ధాన్యం పంపించాలని కేంద్రాల నిర్వాహకులకు జిల్లా అధికారులు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తడిసిన ధాన్యం పంపించగా, మిల్లర్లు మాత్రం తేమ శాతం ఎక్కువగా ఉందని క్వింటాలుకు 5 కిలోలు కోత విధిస్తున్నారని తెలిసింది. సారంగాపూర్ సింగిల్‌విండో పరిధిలో 9 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తారు. గడచిన యాసంగిలో సారంగాపూర్ విండో ద్వారా మొత్తం 83 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తుంటారు. ఈ యాసంగిలో ఇప్పటి వరకు కేవలం 8300 క్వింటాళ్ల కొనుగోళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. సెర్ప్, సింగిల్‌విండోలు ఏర్పాటు చేసిన ప్రతి కేంద్రంలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రైస్‌మిల్లులకు తరలించిన ధాన్యం రోజుల తరబడి లారీల నుంచి మిల్లర్లు దింపుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మిల్లుకు వెళ్లిన ధాన్యం విషయంలో ధాన్యంలో తప్ప, తాలు ఉందని, తేమ శాతం ఎక్కువగా ఉందని పలు ఆంక్షలు పెట్టడంతో కేంద్రాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విషయంపై కేంద్రాల నిర్వాహకులు, రైతులు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై కఠినంగా వ్యవహరిస్తే తప్ప కొనుగోళ్లలో వేగం పుంజుకోదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సమ్మె ఎఫెక్ట్..



గేట్‌వాల్వ్ తిప్పుతున్న సత్యం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి సర్పంచ్ సున్నం నవ్యశ్రీ భర్త సత్యం ఆదివారం పంపు ఆపరేటర్‌గా మారారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేయడం, ఉద్యోగ భద్రత కల్పించాలని మల్టిపర్పస్ వర్కర్లు కూడా సమ్మె చేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆయన వాపోయారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఉండవద్దని తానే పంపు ఆపరేటర్‌గా మారి, తాగు నీటిని విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



ఖాతా పుస్తకాలు అందిస్తున్న నాయకులు

మల్యాల: నిరుపేద కుటుంబానికి మేమున్నామనే ఆర్థిక చేయూతనందించి, భరోసా కల్పించారు ముదిరాజ్ సంఘ నాయకులు. మల్యాల మండల కేంద్రానికి చెందిన ఐతరవేని రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, రమేశ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు తమవంతు సాయం అందించేందుకు అందరూ చేతులు కలిపారు. తెలంగాణ ముదిరాజ్ ఎంప్లాయిస్, మల్యాల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బొజ్జ నర్సయ్య సభ్యుల సహకారంతో రూ.32,950 సేకరించారు. మండల ముదిరాజ్ యువత విభాగం అధ్యక్షుడు దొంతరవేని శేఖర్ రూ.23,500 విరాళాలు సేకరించారు. మల్యాల పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోయిల మల్లేశ్ రూ.5,000, తెలంగాణ యువ చైతన్య ఫౌండేషన్ అధ్యక్షుడు కీసరి గణేశ్ (ఆర్మీ) తోటి సైనికుల సాయంతో రూ.17,450 విరాళాలు సేకరించారు. మల్యాల పోస్టాఫీసులో సుకన్య ఖాతాలో ప్రియమణి పేరు మీద రూ.54,000, మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీమ్ కింద రూ.20,000లో జమ చేసి, ఆదివారం ఖాతా పుస్తకాలు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బొజ్జ నర్సయ్య, దొంతరవేణి శేఖర్, కోయిల మల్లేశ్, గంగిపెల్లి దినేష్, మ్యాదరి లవన్ కుమార్, నీలం రవి, పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థికసాయం

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్ కూతురు వివాహానికి మేము సైతం ఫౌండేషన్ సభ్యులు ఆర్థికసాయం అందించారు. శివరాత్రి శ్రీనివాస్ ఏడాది క్రితం సౌదిలో మృతి చెందగా ఆయన కూతురు వివాహం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేము సైతం ఫౌండేషన్ సభ్యులు రూ.35 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో దారిశెట్టి మహేందర్, దారిశెట్టి గణేశ్, అరిపెల్లి గంగాధర్, గరిపెల్లి శ్రీధర్ మిట్టపెల్లి తిరుపతి రెడ్డి, గొడిసెల వెంకటేశ్ పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారంతోనే రాష్ట్ర అభివృద్ధి

- బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి



సభకు బయలుదేరుతున్న బీఎస్పీ నాయకులు

మెట్‌పల్లి: బహుజనులకు రాజ్యాధికారంతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ భరోసా సభకు నియోజకవర్గం నుంచి నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. దీనిని లింబాద్రి జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలమైందన్నారు. రాజ్యాధికారం దిశగా బహుజనులు ఏకం కావాల్సిన అవసరముందన్నారు. తరలివెళ్లిన వారిలో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రకాశ్‌తో పాటు ప్రభాకర్, కిషోర్, శ్రీధర్, లక్ష్మణ్, గోపి, సలీం తదితరులున్నారు.

కోరుట్ల: హైదరాబాద్‌లో బీఎస్పీ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణా భరోసా సభకు పట్టణం నుంచి బీఎస్పీ శ్రేణులు ఆదివారం భారీగా తరలివెళ్లారు. ఈ సభలో బీఎస్పీ అధినేత మాయావతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని నాయకులు తెలిపారు. హైదరాబాద్ తరలిన వారిలో బీఎస్పీ మండల అధ్యక్షుడు మారంపెల్లి శ్రీధర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శనిగారపు ప్రశాంత్, జిల్లా ఆర్గనైజర్ బత్తుల లక్ష్మణ్, నాయకులు గోరుమంతుల సురేష్, ముక్కెర నాగరాజు, రాజేందర్, కర్రె అశోక్, మారంపెల్లి అరవింద్, నల్ల అచ్యుత్, వెంకటేశ్, లక్పతి, నిఖిల్, తదితరులు ఉన్నారు.

కథలాపూర్ నుంచి తరలివెళ్లిన నాయకులు

కథలాపూర్: హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ భరోసా సభకు మండలంలోని బీఎస్పీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వాహనాలతో ర్యాలీగా కథలాపూర్‌కు చేరుకున్నారు. అనంతరం వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మండలం నుంచి 200 మంది సభకు తరలివెళ్లినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు తెడ్డు శేఖర్, నీలకంఠం, కలిగోట రాజయ్య, చాకలి వెంకటేశ్, సంజీవ్, గణేశ్ ఉన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో ఆదివారం విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వర్షాలతో వైర్లు తెగి కిందపడితే ఎవరు తాకవద్దని, విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సిబ్బంది శ్యామ్, రవి, రైతులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు

మల్లాపూర్: అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రవీందర్ హెచ్చరించారు. మండలంలోని సాతారంలో శనివారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గోదావరినది, పెద్దవాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది దాడులు నిర్వహించి సాతారంలో ఇసుక ట్రాక్టర్ పట్టుకుని తహసీల్దార్ కార్యలయానికి తరలించారని తహసీల్దార్ తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆర్ఐలు విశ్వనాథ్, రాజేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్: మండలంలోని అల్లీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అల్లీపూర్,సింగరావుపేట, శ్రీరాంనగర్,కుర్మపెల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ హరీశ్ ఆదివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొండస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: మండలంలోని జగ్గాసాగర్‌లో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి(కొండస్వామి) జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం జరిగే కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో యువకుల్లో ఐక్యత పెరుగుతుంది

సారంగాపూర్: క్రీడలతో యువకుల్లో ఐక్యత పెరుగుతుందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో ఆదివారం యువకులతో కలిసి క్రికెట్ ఆడారు. క్రీడలు యువతి, యువకుల్లో ఐక్యత, ఆరోగ్యాన్ని పెంచుతాయని తెలిపారు. ఆమె వెంట పలువురు నాయకులు ఉన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహానికి అద్దకం.. ఊరేగింపు



పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో పెద్దమ్మతల్లి విగ్రహానికి అద్దకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోతరాజులు ఆలయం నుంచి ప్రత్యేక వాహనంలో గ్రామ ప్రదక్షిణలు చేయించారు. 15 రోజుల తర్వాత పెద్దమ్మ తల్లి పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు చిన్న గంగారాం, శేఖర్, రాజారెడ్డి, భూమేశ్, మహేందర్, అంజయ్య, నర్సయ్య, సురేందర్, రాజయ్య, లస్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ బోనాలతో వస్తున్న మహిళలు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.